వాస్తవాలు చెప్పేందుకే శ్వేతపత్రం

- 6 గ్యారెంటీలను ఎగ్గొట్టేందుకు కాదు
- మాకు ఎవర్నీ కించపరిచే ఆలోచన లేదు
- ప్రతి శాఖ కార్యదర్శి సంతకం చేసి, అందించిన లెక్కలే శ్వేతపత్రంలో పెట్టినం
- చట్టాలన్నీ అసెంబ్లీలో చర్చించాకే చేస్తాం
- శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): శ్వేతపత్రం విడుదల చేసింది ఆరు గ్యారెంటీలను ఎగ్గొట్టేందుకు కాదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వాస్తవాలను ప్రజలకు తెలియజేసి, కష్టమైనా సరే నిస్సహాయులకు అండగా ఉంటామని తెలిపేందుకేనని వెల్లడించారు. ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. ప్రపంచంతో తెలంగాణ పోటీ పడాలనేదే తమ ఉద్దేశమని, వాస్తవాలను ప్రజలకు తెలిపి ముందుకు వెళ్లాలని భావిస్తున్నామని అన్నారు. శ్వేతపత్రం విడుదలలో ఎలాంటి రాజకీయ ప్రయోజనం లేదని, ఎవరినో కించపరచాలనో, ఎవరినో తక్కువ చేయాలనే ఆలోచన లేదని తెలిపారు. శ్వేతపత్రం ద్వారా వాస్తవాలను తెలియజేయటం కొంతమందికి చేదుగా ఉండొచ్చని అన్నారు. తెలంగాణ ఏర్పడేనాటికి ఆర్బీఐ వద్ద 303 రోజులు మిగులు బడ్జెట్ ఉంటే గత ఐదేండ్లలో ఏ సంవత్సరం కూడా రోజువారీ మిగులు బడ్జెట్ లేదని వెల్లడించారు. ప్రతి రోజు ఆర్బీఐ వద్ద అడుక్కునే పరిస్థితి ఏర్పడిందని వివరించారు.

శాఖల కార్యదర్శులు సంతకం చేశాకే..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్వేతపత్రం రాష్ట్ర అధికారులు తయారు చేయలేదంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర అధికారులను ఈ విధంగా అవమానించడం మంచిది కాదని అన్నారు. ప్రభుత్వం పంపిన ఫార్మాట్ ఆధారంగా ప్రతి శాఖ కార్యదర్శి సంతకం చేసిన ఇచ్చిన లెక్కలనే శ్వేతపత్రంలో పొందుపర్చామని తెలిపారు. తాము అధికారులపై కక్షపూరితంగా వ్యవహరించబోమని, అధికారంలో ఉన్నప్పుడు ఎవరైనా తమను కలుస్తారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిపై ఆలోచన ఉంది కాబట్టే తానే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఫోన్ చేసి ప్రధానిని కలిసేందుకు సహకరించాలని కోరామని అన్నారు.

అందరితో చర్చించే చట్టాలు చేస్తాం

తమ ప్రభుత్వంలో ఏకపక్ష నిర్ణయాలు ఉండబోవని, ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని సభలో అఖిలపక్షం ముందు పెట్టి, చర్చించి సలహాలు, సూచనలు తీసుకున్నాకే చట్టాలు చేస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే హైదరాబాద్ అభివృద్ధిపై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని, ఈ సమావేశానికి అన్ని పార్టీలతోపాటు ప్రజాసంఘాలను కూడా ఆహ్వానిస్తామని ఆయన వెల్లడించారు.

అక్కడ కాగ్ లెక్కలు.. ఇక్కడ ఆర్బీఐ లెక్కలు

ఆదాయ, వ్యయాలకు కాగ్ లెక్కల్ని, రుణాలు, అడ్వాన్స్‌లకు సంబంధించి ఆర్బీఐ లెక్కల్ని తీసుకొన్నట్టు రేవంత్‌రెడ్డి చెప్పారు. పదేండ్ల పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందని, బీఆర్ఎస్ సభ్యులు అబద్ధాలతో సభను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఆస్తులను తనఖా పెట్టి అందినకాడికి అప్పులు చేశారని విమర్శించారు. ఔటర్ రింగురోడ్డును రూ.6,500 కోట్లతో నిర్మిస్తే, దాన్ని రూ.7,700 కోట్లకు అమ్ముకున్నారని విమర్శించారు. కేజీ టు పీజీ కార్యరూపం దాల్చలేదని, గిరిజనులు, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు అమలు చేయలేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అసెస్‌మెంట్ వ్యాల్యూ రూ.1,23,872 కోట్లు కాగా, అందులో రూ.96,876 కోట్ల పనులు పూర్తయ్యాయని, ఇందులో రూ.32,076 కోట్లు బడ్జెట్ నుంచి, మిగిలిన మొత్తం కార్పొరేషన్ ద్వారా రుణం తీసుకున్నారని వివరించారు. జూబ్లీ బస్టాండ్‌సహా పలు ఆర్టీసీ డిపోలు, ఇతర ఆస్తులు తనఖా పెట్టి రూ.2,886 కోట్లు, జెన్‌కో ఆస్తులపై రూ.2,100 కోట్లు, ఎన్పీడీసీఎల్‌పై రూ.2,872 కోట్ల అప్పులు తీసుకున్నారని చెప్పారు.

అప్పులు చేయనిదే ఏ రాష్ట్రమూ ముందుకు పోదు: శ్రీధర్‌బాబు

శ్వేతపత్రంలో తప్పుడు లెక్కలు ఉన్నాయని, అసలు శ్వేతపత్రం ఎందుకు పెట్టాల్సి వచ్చిందో చెప్పాలన్న అక్బరుద్దీన్ డిమాండ్‌పై శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన అప్పులు చేయడం తప్పు కాదని చెప్పడం గమనార్హం. అప్పులు చేయనిదే ఏ రాష్ట్రమూ ముందుకు పోదని కుండబద్దలు కొట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'ఈ రోజు వైట్ పేపర్ పెట్టడానికి కారణం.. స్టేట్ ఏదో డెఫిసిట్‌లోకి పోతుందని, రాబోయే కాలంలో ఏం చేయలేని పరిస్థితులో ఉందని, ఆర్థిక పరిస్థితులు బాగాలేవని గ్లోబల్ లెవల్‌లో ఫోకస్ చేయడానికి కాదు. ఇది బీఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏండ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్ట్ మాత్రమే. అప్పులు చేయనిదే ఏ రాష్ట్రమూ ముందుకు పోదు' అని తెలిపారు.

లోకం పోకడ



శ్వేతపత్రం పేరుతో రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీయొద్దు

బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సూచన

హైదరాబాద్, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): శ్వేతపత్రం పేరుతో రాష్ట్ర విశ్వసనీయత, ప్రతిష్ఠను దెబ్బతీయవద్దని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రభుత్వానికి సూచించారు. బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. శ్వేతపత్రాల వల్ల రాష్ట్ర భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని, కంపెనీలు రాకుండా పోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రయోజనాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని, కాబట్టి తెలంగాణను అప్పులు రాష్ట్రంగా క్రియేట్ చేయవద్దని కోరారు. రాష్ట్రం నెత్తిపై భారీ అప్పు ఉన్నదని తెలిస్తే మళ్లీ రుణాలు వస్తాయా? అని ప్రశ్నించారు.

లెక్కల్లో ఇవేం తేడాలు?

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం లెక్కల్లో తేడాలు ఉన్నాయని, ఇలాంటి ముఖ్యమైన నివేదికలు ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. అసెంబ్లీలో మాట్లాడుతూ తప్పులు చేసిన తర్వాత ఎంత సర్దిచెప్పుకొన్నా అది పనికిరాదని పేర్కొన్నారు. అప్పులు చేయడం తప్పుకాదని, అప్పుల పేరుతో రాష్ట్రం పరువు పోకుండా చూడాలని కోరారు.

నేడు విద్యుత్తుపై శ్వేతపత్రం

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): శాసనసభలో గురువారం విద్యుత్తు అంశంపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయనున్నది. ఈ మేరకు శాసనసభ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు బుధవారం బులిటెన్ విడుదల చేశారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి గురువారం మళ్లీ ఢిల్లీకి వెళ్లనున్నారు. అక్కడ జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల్లో ఆయన పాల్గొననున్నారు. అసెంబ్లీ సమావేశాల జరుగుతుండటంతో ఏ సమయానికి వెళ్తారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. మంగళవారం ఢిల్లీకి వెళ్లి బుధవారమే రాష్ట్రానికి తిరిగొచ్చిన ముఖ్యమంత్రి మరునాడే ఢిల్లీకి వెళ్లనున్నారు.

కుటుంబం.. అన్నగారి కుటుంబం

మొదటిపేజీ తరువాయి...

అయితే.. ఒక్కసారి ఈ పక్క ఫొటోలను గమనించండి. మొదటి ఫొటోలో కనిపిస్తున్న అధికారిక కాన్వాయ్ సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడు కొండల్‌రెడ్డిది. కామారెడ్డిలో ఈ నెల 14న కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన అధికార లాంఛనాలతో ఇలా తరలివచ్చి పాల్గొన్నారు. రెండో ఫొటోలో ఉన్నది కూడా కొండల్‌రెడ్డే.. ఆయనకు పోలీస్ కాన్వాయ్‌తోపాటు 2+2 గన్‌మెన్ భద్రతను ప్రభుత్వం కేటాయించినట్టు తెలిసింది. ఈ ఫొటోలో కొండల్‌రెడ్డి వెనుక నిలబడిన గన్‌మెన్‌ను చూడవచ్చు. ఇక మూడో ఫొటో అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం వికారాబాద్ జిల్లా అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక సమావేశం నిర్వహిస్తున్న సమయంలోనిది. ఇందులో ఎడమవైపు చివరన కూర్చున్న వ్యక్తి పేరు తిరుపతిరెడ్డి. రేవంత్‌రెడ్డికి స్వయానా అన్న. బుధవారం ఆయన కలెక్టరేట్‌కు వెళ్లి, కలెక్టర్ ముందే సోఫాలో కూర్చొని అందరినీ అజమాయిషీ చేసినట్టు ఫొటోలు బయటకు వచ్చాయి. రేవంత్‌రెడ్డి సోదరులు ఎమ్మెల్యేలు కాదు. ఎంపీలు కాదు.. ఏ రకమైన ప్రజాప్రతినిధులు కూడా కాదు. కానీ, అధికారిక సమావేశాల్లో పాల్గొంటున్నారు. ప్రభుత్వం వారికి భారీ పోలీస్ కాన్వాయ్ కేటాయించింది. భారీ భద్రత ఏర్పాటు చేసింది. రేవంత్‌రెడ్డి ఇన్నాళ్లూ కేసీఆర్‌ది కుటుంబ పాలన అని విమర్శించారు. మరి ఏ హోదా లేని ఆయన సోదరులు అధికారిక సమావేశాల్లో ఎలా పాల్గొంటున్నారు? దీన్నేమంటారు? దీనికి రేవంత్ ఏమంటారు? అని నెటిజన్లు ఆ ఫొటోలను సోషల్‌మీడియాలో షేర్‌చేస్తూ ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్ర అప్పులు 6,71,757 కోట్లు

- తొమ్మిదిన్నరేండ్లలో 9 రెట్లు పెరుగుదల
- బడ్జెట్ అంచనాలు, వాస్తవంలో వ్యత్యాసం
- 4 రెట్లకుపైగా పెరిగిన రాష్ట్ర ఆదాయం
- 13 రెట్లు పెరిగిన రాష్ట్ర రెవెన్యూ మిగులు
- ఎఫ్ఆర్బీఎం నిబంధనల మేరకే ద్రవ్యలోటు
- ఆదాయానికి తగ్గట్టుగా వేతనాలు, పెన్షన్లు
- శ్వేతపత్రం విడుదల చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి రూ.72,658 కోట్లుగా ఉన్న రాష్ట్ర రుణాలు, ఇప్పుడు 6,71,757 కోట్లకు పెరిగినట్టు ప్రభుత్వం తెలిపింది. ఆర్థిక పరిస్థితులపై బుధవారం అసెంబ్లీలో శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. తెలంగాణ ఆర్థిక రంగం బలమైన పునాదులతో ప్రారంభమైందని పేర్కొన్నది. మొదటి ఐదేండ్లలో రెవెన్యూ మిగులుతోపాటు ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ నిబంధలను నాటి ప్రభుత్వం పాటించిందని అభినందించింది. ఆ తర్వాత పలు భారీ సాగునీటి ప్రాజెక్టులకు స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్పీవీ)లు సృష్టించి, బడ్జెట్ వెలుపల రుణాలు తీసుకోవడం ప్రారంభించిన తర్వాత ఇబ్బందులు మొదలయ్యాయయని పేర్కొన్నది. ఎస్పీవీలకు రాబడులు లేకపోవడంతో ఆ రుణాల చెల్లింపు రాష్ట్ర ప్రభుత్వమే చేస్తున్నదని చెప్పింది. రాష్ట్ర ఆదాయం 4 రెట్లకుపైగా పెరుగగా, రెవెన్యూ మిగులు 13 రెట్లు పెరిగినట్టు గణాంకాలు చెప్తున్నాయి. ద్రవ్యలోటు ఎఫ్ఆర్బీఎం పరిమితికి లోబడే ఉన్నదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

భారీగా పెరిగిన రాష్ట్ర రుణాలు

రాష్ట్రం ఆవిర్భావం నాటికి రుణాలు 72,658 కోట్లు ఉంటే.. ఈ ఏడాదికి బడ్జెట్ అంచనాల ప్రకారం 3,89,673 కోట్లకు పెరిగినట్టు శ్వేతపత్రంలో పేర్కొన్నారు. 2014-23 మధ్య సగటున 24.5 శాతం చొప్పున రుణాలు పెరిగినట్టు ప్రభుత్వం వెల్లడించింది. 2015-15లో రాష్ట్ర రుణ-జీఎస్డీపీ నిష్పత్తి 15.7 శాతంగా ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరానికి 27.8 శాతానికి పెరిగిందని పేర్కొన్నది. ప్రభుత్వ హామీతో 17 స్పెషల్ పర్పస్ వెహికిల్స్ (ఎస్పీవీ) ఏర్పాటు చేసి రూ.1,85,029 కోట్లు సేకరించినట్టు వెల్లడించింది. ప్రభుత్వం హామీలేని రుణాలు కూడా కలుపుకొంటే మొత్తంగా రాష్ట్ర రుణాలు 6,71,757 కోట్లకు పెరిగినట్టు తెలిపింది. మరోవైపు అసలు, వడ్డీల చెల్లింపుల భారం ప్రభుత్వంపై ప్రతి సంవత్సరం పెరుగుతున్నట్టు చెప్పింది. 2014-15లో అసలు, వడ్డీ చెల్లింపులు రూ.7,255 కోట్లుగా ఉన్నాయని, 2023-24 నాటికి రూ.53,978 కోట్లకు చేరాయని వివరించింది. గతంలో మొత్తం ఆదాయంలో చెల్లింపులకు 14 శాతం పోగా, ఇప్పుడు 34 శాతానికి పెరిగినట్టు తెలిపింది.

ప్రభుత్వం పేర్కొన్న రుణాలు

- ఎఫ్ఆర్బీఎం లోన్లు - రూ.3,89,673 కోట్లు
- ఎస్పీవీలకు ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చిన రుణాలు - రూ.1,27,208 కోట్లు
- ఎస్పీవీలు సొంతంగా సేకరించిన రుణాలు - రూ.95,462 కోట్లు
- కార్పొరేషన్లు, సంస్థల లోన్లు-59,414 కోట్లు
- మొత్తం- రూ.6,71,757 కోట్లు

రెవెన్యూ మిగులు.. అదుపులో ద్రవ్యలోటు

2014-15లో రాష్ట్రంలో 369 కోట్ల రెవెన్యూ మిగులు ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ అంచనాల ప్రకారం 4,882 కోట్లు మిగులు ఉన్నట్టు శ్వేతపత్రంలో ప్రభుత్వం వెల్లడించారు. అంటే సుమారు 13 రెట్లు పెరిగింది. కరోనా ఇబ్బంది పెట్టిన రెండుమూడేండ్లు తప్ప మిగతా అన్ని సంవత్సరాలు మిగులు ఉన్నట్టు స్పష్టం చేశారు. ఎఫ్ఆర్బీఎం నిబంధనల ప్రకారం ద్రవ్యలోటు జీఎస్డీపీతో పోల్చితే అదుపులోనే ఉన్నట్టు నివేదిక తెలిపింది. 2014-15లో జీఎస్డీపీలో 1.9% ద్రవ్యలోటు ఉండగా, 2023-24 నాటికి 2.7 శాతానికి పెరిగిందని తెలిపింది. ఎఫ్ఆర్బీఎం నిబంధనలు 3%లోపే ఉండాలని సూచిస్తున్నాయని చెప్పింది.

రెవెన్యూ రాబడులు నాలుగు రెట్లు

తెలంగాణలో గత తొమ్మిదిన్నరేండ్లలో రెవెన్యూ రాబడులు నాలుగు రెట్లకుపైగా పెరిగినట్టు శ్వేతపత్రంలో ప్రభుత్వం ప్రకటించింది. 2014-15లో రూ.51,042 కోట్లు ఉండగా, 2023-24 నాటికి రూ.2,16,567 కోట్లకు పెరిగినట్టు చెప్పింది. అయితే వృద్ధిరేటులో మాత్రం అస్థిరత కొనసాగినట్టు తెలిపింది. 2015-16లో 49.16 శాతం వృద్ధిరేటు ఉండగా, 2023-24 నాటికి 35.91 శాతంగా ఉన్నదని వెల్లడించింది. జీఎస్డీపీతో పోల్చితే రెవెన్యూ ఆదాయం 2014-15లో 10.1 శాతం ఉండగా, ఇప్పుడు 15.3 శాతానికి పెరిగిందని పేర్కొన్నది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఇతర 18 రాష్ట్రాల జీఎస్డీపీతో రెవెన్యూ రాబడులు పోల్చితే తెలంగాణ 13వ స్థానంలో ఉన్నట్టు పేర్కొన్నది.

సంవత్సరం	రెవెన్యూ ఆదాయం	వృద్ధిరేటు (శాతం)
2014-15	51,042	-
2015-16	76,134	49.16
2016-17	82,818	8.78
2017-18	88,824	7.25
2018-19	1,01,420	14.18
2019-20	1,02,544	1.11
2020-21	1,00,914	-1.59
2021-22	1,27,469	26.31
2022-23	1,59,350	25.01
(ప్రాథమిక అంచనాలు)		
2023-24	2,16,567	35.91
(బడ్జెట్ అంచనాలు)		

- వేతనాలు, పెన్షన్లకు 2014-15లో 17,130 కోట్లు చెల్లించగా, ప్రస్తుతం రూ.55,925 కోట్లు చెల్లిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. 2014-15లో మొత్తం ఆదాయంలో 34 శాతం ఉండగా, ఇప్పుడు 35 శాతంగా ఉన్నది. అంటే రాష్ట్ర ఆదాయం పెరుగుదలకు తగ్గట్టుగా వేతనాల పెంపు ఉన్నట్టు స్పష్టం చేసింది.
- రాష్ట్రం ఏర్పడి తర్వాత ప్రభుత్వం 24 శాఖలకు సంబంధించి 39,175 పని ఒప్పందాలు చేసుకున్నదని, వీటి విలువ 3,49,843 కోట్లుగా పేర్కొన్నది. ఇందులో ఇప్పటివరకు 1,89,903 కోట్లు ఖర్చు చేసినట్టు వెల్లడించింది.
- జాతీయ విద్యావిధానం 2020 ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో ప్రభుత్వ పెట్టుబడి 6 శాతానికి చేరుకోవాలి. 2023-24లో తెలంగాణ 7.6% ఖర్చు చేస్తుందని అంచనా వేసింది. స్టేట్ ఆఫ్ స్టేట్ ఫైనాన్సెస్ నివేదిక ప్రకారం 2023-24లో రాష్ట్రాలు తమ బడ్జెట్‌లో సగటున 14.7% విద్యపై ఖర్చు చేస్తున్నట్టు వెల్లడించింది. ఇదే విధంగా ఆరోగ్య బడ్జెట్ తెలంగాణలో 5 శాతంగా ఉన్నది.

వాస్తవ వ్యయం 82 శాతమే

2014లో రూ.1,00,638 కోట్లతో ప్రారంభమైన రాష్ట్ర బడ్జెట్ అంచనాలు, 2022-23 నాటికి రూ.2,04,085 కోట్లకు చేరాయని ప్రభుత్వం పేర్కొన్నది. అయితే అంచనాలకు, వాస్తవ వ్యయానికి భారీగా వ్యత్యాసం ఉన్నట్టు తెలిపింది. సగటున 82.3 శాతంగా మాత్రమే ఉన్నట్టు వెల్లడించింది. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ వాస్తవ వ్యయం 102.9 శాతంగా ఉన్నట్టు పేర్కొన్నది. ఉమ్మడి రాష్ట్రంలో 2004-2014 మధ్య సగటున 87 శాతం వాస్తవ వ్యయం ఉన్నట్టు నివేదిక తెలిపింది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో వాస్తవ వ్యయం విషయంలో రాజస్థాన్ 116.4 శాతంతో దేశంలోనే అగ్రస్థానంలో ఉండగా, కర్ణాటక 113.1 శాతం, మధ్యప్రదేశ్ 110.6 శాతం, కేరళ 100.7 శాతం, మహారాష్ట్ర 99.3 శాతంతో టాప్-5 రాష్ట్రాలుగా ఉన్నాయి. తెలంగాణ 79.3 శాతంతో 17వ స్థానంలో నిలిచింది. 18 రాష్ట్రాల్లో తెలంగాణ కింది నుంచి రెండో స్థానంలో ఉన్నట్టు నివేదిక తెలిపింది.

సంవత్సరం	బడ్జెట్ అంచనాలు (రూ.కోట్లు)	వాస్తవ వ్యయం (రూ.కోట్లు)	శాతం
2014-15	1,00,638	62,306	61.9
2015-16	1,15,689	97,811	84.5
2016-17	1,30,416	1,21,735	93.3
2017-18	1,49,646	1,20,211	80.3
2018-19	1,74,454	1,35,328	77.6
2019-20	1,46,492	1,42,857	97.5
2020-21	1,82,914	1,57,547	86.1
2021-22	2,30,726	1,82,998	79.3
2022-23	2,56,859	2,04,085	79.5
మొత్తం	14,87,834	12,24,877	82.3
2023-24	2,90,396	1,48,0531	51.0
(బడ్జెట్ అంచనాలు)			

పదేండ్లలో విధ్వంసం

అసెంబ్లీలో భట్టి విక్రమార్క నిప్పులు

రాష్ట్రంపై దాదాపు రూ.7 లక్షల కోట్ల అప్పుల భారం ఉన్నదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక విధ్వంసం, అరాచకత్వం జరిగిందని తీవ్రస్థాయిలో ఆరోపించారు. బుధవారం అసెంబ్లీలో ఆర్థిక పరిస్థితిపై నిర్వహించిన చర్చకు సమాధానంగా భట్టి మాట్లాడుతూ.. బడ్జెట్‌లో చేసిన అప్పులకు ప్రభుత్వం ఏటా రూ.53 వేల కోట్ల వడ్డీ చెల్లించాల్సిన దుస్థితికి రాష్ట్రాన్ని తెచ్చారని మండిపడ్డారు. తెలంగాణ అప్పు రూ. 5 లక్షల కోట్లు అనే ఇన్నాళ్లు అనుకున్నామని పేర్కొన్నారు. ఈ అప్పును గత ప్రభుత్వం రూ. 7 లక్షల కోట్లకు పెంచి దానిని బయటపెట్టకుండా దాచిపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చుతాం

ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందని భట్టి పేర్కొన్నారు. మిషన్ భగీరథపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తానని పేర్కొన్నారు. శ్వేతపత్రాన్ని ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ అధికారితో తయారుచేయించారంటూ హరీశ్‌రావు చేసిన విమర్శలపై మాట్లాడుతూ.. ఆయన వ్యాఖ్యలు తెలంగాణ అధికారులను అవమానించేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ విధానాలతో రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు పెరిగాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు భ్రమలు కల్పించారని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యంలో స్వేచ్ఛగా, హాయిగా బతకొచ్చని భట్టి పేర్కొన్నారు.

శ్వేతపత్రం రూపకర్తలెవరు?

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రం ఎవరు తయారుచేశారన్నదానిపై అసెంబ్లీ లాబీల్లో ఆసక్తికర చర్చ జరిగింది. శ్వేతపత్రం ఎవరు తయారుచేశారో తనకు తెలుసని, ఇక్కడి అధికారులను నమ్మకుండా వేరేవాళ్లతో రూపొందించారని హరీశ్‌రావు శాసనసభలో చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. ముఖ్యమంత్రి మాజీ గురువు శిష్యులు ఇద్దరు శ్వేతపత్రం తయారీలో పాల్గొన్నారని, వారిలో ఒకరు మాజీ ఐఏఎస్ అధికారి కాగా, మరొకరు ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అధికారి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యల నేపథ్యంలో వారిద్దరూ ఎవరన్న చర్చ అసెంబ్లీ లాబీల్లో మొదలైంది.

శ్వేతపత్రం.. సెల్ఫ్‌గోల్!

- అంతర్మథనంలో కాంగ్రెస్ పార్టీ పెద్దలు
- విపక్షాల విమర్శలు ఎదుర్కోలేకపోయామా
- తప్పుల్లేవని నిరూపించలేకపోయామా?
- ఎదురుదాడిని నివారించలేకపోయామా?

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): పదేండ్ల బీఆర్ఎస్ పార్టీ పాలనలో అప్పులే మిగిలాయని చూపించి.. ఆ పార్టీని బోనులో నిలబెట్టాలనుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం 'కబడ్డీలో కాలు ఇచ్చి దొరికిపోయిన ట్టు'గా ఉన్నదని కాంగ్రెస్ నేతలే వాపోతున్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై బుధవారం అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల ద్వారా అడ్డంగా బుక్కయ్యామన్న వాదనను కాంగ్రెస్ నేతలే వినిపిస్తున్నారు. శ్వేతపత్రం విడుదల చేయడం లాభమా..? నష్టమా..? అన్నది వారు తేల్చుకోలేకపోతున్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనను ఇరుకునపెట్టి ప్రజల ముందు దోషిగా చూపించే వ్యూహం బెడిసికొట్టిందన్న వాదన బలంగా వినిపిస్తున్నది.

చర్చ ప్రారంభించకుండానే..

అసెంబ్లీలో బుధవారం రాష్ట్ర ఆర్థికస్థితిపై లఘు చర్చను ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఆయన శ్వేతపత్రాన్ని ప్రవేశపెడుతున్నామని చెప్పారే కానీ, దాని నేపథ్యాన్ని సభ్యులకు వివరించలేదు. శ్వేతపత్రంపై జరిగిన చర్చలో కాంగ్రెస్ పార్టీలో సమన్వయలోపం కొట్టొచ్చినట్టు కనిపించింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇలా ఎవరికివారే యమునా తీరే అన్నట్టు వ్యవహరించారు. హరీశ్‌రావును నిలువరించటంలో, ఆయన లేవనెత్తిన అంశాలపై సరైన అస్త్రాలను సంధించటంలో తమవాళ్లు సఫలీకృతం కాలేకపోరాయనే వాదన వినిపించింది. ఆర్థిక వ్యవస్థ విధ్వంసం జరిగిందని భట్టి పేర్కొనగా, రాష్ట్రం దివాలా తీయలేదు, అప్పులు చేయడం సహజమని మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. రాజకీయంగా ఎవరినో విమర్శించడానికో, ఎవరినో బద్నామ్ చేయడానికో శ్వేతపత్రం విడుదల చేయలేదని ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొనటం గందరగోళానికి గురిచేసిందన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఇక మంత్రి కొండా సురేఖ వరంగల్‌లో సెంట్రల్ జైలును కూలగొట్టి ఆ స్థానంలో దవాఖాన కట్టడం సరైంది కాదని, దవాఖాన ఊరుబయట ఉండాలని చెప్పటం విమర్శలపాలు చేసిందని అంటున్నారు.

అప్పు పుట్టుట ప్రశ్నార్థకమా?

కొత్త ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయటం ద్వారా కొత్త అప్పులు పుట్టకుండా చేసిందా? అంటే అవుననే వాదన వినిపిస్తున్నది. పదేండలో రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని దేశవిదేశాల నిపుణులు, చివరికి ప్రత్యర్థులు కూడా అంగీకరిస్తున్న సత్యం. కానీ మంచినీరు, తాగునీరు లేవని చెప్పే ప్రయత్నం చేసి కాంగ్రెస్ బొక్కాబోర్లా పడిందనే వాదన వినిస్తున్నది. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై సంపూర్ణ అవగాహనకు రాకముందే అతితీలకమైన ఆర్థిక అంశంపై చర్చకు తెరలేపి అధికార పార్టీ తమ డొల్లతనాన్ని బయటపెట్టుకున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శ్వేతపత్రం వెనుక మీ ఉద్దేశం ఏమిటి?

- గత ప్రభుత్వ ఆర్థిక నిర్వహణను విమర్శించాలనుకున్నారా?
- తెలంగాణ రాష్ట్రం అప్పల ఊబిలో ఉన్నదని చెప్పదలచుకున్నారా?
- ఈ మిషతో మీరిచ్చిన గ్యారెంటీలను ఎగ్గొట్టాలనుకుంటున్నారా?
- శ్వేతపత్రంపై చర్చలో అక్బరుద్దీన్ ఒవైసీ

హైద